వేసవి నీటి ఎద్దడిపై చర్చలేనా... చర్యలు లేవా..?

తాగునీటి సమస్యపై కౌన్సిలర్లు ఆగ్రహం

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది..15 రోజులకు ఒకసారి కొళాయి ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు...ప్రతీ మున్సిపల్ సమావేశంలో నీటి ఎద్దడి పై చర్చలే చేస్తున్నారే తప్ప ఎందుకు తాగునీరు సరఫరా చేయలేక పోతున్నారని కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. శనివారం పలాస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలిసినా నివారణ చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల్లో బోర్లు పాడైన బాగు చేయడం లేదని, పవర్ బోర్లు మరమ్మతులకు గురయ్యాయని చెప్పిన పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ సమావేశంలో చర్చలు జరుపుతున్నారే తప్ప పరిష్కారం చేయడం లేదని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ స్పందిస్తూ మున్సిపాలిటీలో ఇప్పటివరకు నాలుగు ట్యాంకులతో నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఆదివారం నుంచి అదనంగా మరో నాలుగు ట్యాంకులతో నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పాడైన బోర్లు, పవర్ బోర్లుకు మరమ్మతులు చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల సహకారంతో చాలా వార్డుల్లో బోర్లు వేయడం జరిగిందని చెప్పారు. కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కాశీబుగ్గ బస్టాండ్ సమీపం అప్సర హెూటల్ వద్ద మున్సిపాలిటీ కాలువ పై టీ దుకాణాలు పెట్టడం ద్వారా రోడ్డుపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని దీంతో ప్రయాణికులు, బస్సులు, వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో కూడా ఇదే సమస్యపై చెప్పిన అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. కౌన్సిలర్ పప్పల ప్రసాద్ మాట్లాడుతూ కాశీబుగ్గ టెలిఫోన్ కార్యాలయం వద్ద మురికి కాలువ నుంచి మురికి నీరు రోడ్డు పై ప్రవహిస్తుందని, దీంతో ప్రయాణికులు, స్థానికులు, ఇతర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎజెండాలో ఉన్న అంశాలను ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదం తెలిపారు. సమావేశంలో వైఎస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంశధార జలాలతోనే ఇచ్ఛాపురం సస్యశ్యామలం

విశాలాంధ్ర-సోంపేట : దక్షిణ భారత దేశానికి తూర్పుముఖంగా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న మొట్టమొదటి నియోజకవర్గమైన ఇచ్ఛాపురానికి దశాబ్దాల తరబడి తాగునీటి సౌకర్యాలు లేక వ్యవసాయ పరిస్థితులు సాగక లక్షలాది మంది ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారని ఇచ్ఛాపురం నియోజకవర్గ వంశధార జలసాధన కమిటీ అధ్యక్షులు డాక్టర్ ప్రధాన శివాజీ పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో గల సుమారు 70వేల ఎకరాల సాగుభూమితో పాటు పక్కనే ఉన్న పలాస నియోజకవర్గంలో సుమారు 20వేల ఎకరాలు వెరశి మొత్తం 90వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించి ప్రతి ఏటా వ్యవసాయం ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. వంశధార జలసాధన కమిటీ సభ్యులతో శనివారం ఆయన సోంపేటలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని చిట్టచివరనున్న ఈ నియోజకవర్గాన్ని వ్యవసాయాభివృద్ధి, సాగునీటి కల్పన విషయంలో ఇప్పటి వరకు సరైన సదుపాయాలు కల్పించక సుమారు 70 శాతం మంది వ్యవసాయాధిరిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉద్దానం ప్రాంతంలో తాగునీటి సమస్యతో పాటు అధికంగా ప్రబలి ఉన్న కిడ్నీ వ్యాధుల నివారణకు జలజీవన్ మిషన్ ద్వారా వంశధార జలాలను తీసుకు రావడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి కృతజ్ఞతలు తెలిపారు. తాగునీరు అందించినప్పటికి సాగునీరు లేక ఇతరత్రా సాగునీటి వనరులు అందుబాటులో లేక వ్యవసాయం ప్రతిఏటా సాగక ప్రజలు పడుతున్న అవస్థలు ఎంతో ఇబ్బందికరమని అన్నారు. ఇటువంటి ప్రాంతానికి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న వంశధార నుంచి నదీ జలాలను తరలించి నియోజకవర్గం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో జీఓ నెంబరు 14 ద్వారా 2019 ఫిబ్రవరి 16న 6326 కోట్లు రూపాయల పరిపాలన ఆమోదంతో వంశధార, నాగావళి నదుల అనుసంధానంతో ఇచ్ఛాపురం వరకు సాగునీటిని తరలించే ప్రక్రియకు గత ప్రభుత్వం చొరవ చూపినప్పటికి అదే ఏడాది వచ్చిన ఎన్నికల నోటిఫికేషన్‌తో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయని గుర్తు చేశారు. వంశధార జలాలు ఇచ్ఛాపురం వరకు మళ్లించితే పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో 2.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందడం ద్వారా ఒకవైపు పల్లపు ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధితో పాటు ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి, జీడి, మామిడి మొదలైన పంటలకు సాగునీరు అందుతూ భూగర్భ జలాల అభివృద్ధికి ఇతోదికంగా దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డిఎస్పీ ఎస్‌వివి ప్రసాదరావు, డి.శ్రీనివాసరావు, మర్ల జేజేరావు, బెందాళం వెంకటేశ్వరరావు, ఇప్పిలి కృష్ణారావు, పూడి కిరణ్‌కుమార్, జి.కృష్ణారావు, డి.దాలిబందు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపించడానికి సిద్ధం

విశాలాంధ్ర-టెక్కలి : రాక్షస పాలన నుండి ప్రజలకు విముక్తి లభిందని ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్ ను ఇంటికి పంపిడానికి సిద్ధంగా ఉన్నారని, జగన్ రెడ్డి ఇదేళ్ల విధ్వంసక, విద్వేష పాలనతో రాష్ట్రాన్ని అన్ని విధాల నాశనం చేసారని తెలుగుదేశం మండల నాయకులు అన్నారు.రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాక్షస పాలన నుండి ప్రజలకు విముక్తి లభించిందని,మరో 45 రోజుల్లో పూర్తి స్వేచ్ఛ లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్ ను ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని,జగన్ రెడ్డి ఐదేళ్ల విధ్వంసక, విద్వేష పాలనతో రాష్ట్రాన్ని అన్నివిధాల నాశనం చేశారని,ఎస్సీ, ఎస్టీకి చెందిన 28 పథకాలు, బీసీకి చెందిన 30 పథకాలు, మైనార్టీలకు చెందిన 11 పథకాలను రద్దు చేసి వందలాదిమందిపై మారణహెూమం సృష్టించిన పాలనకు ముగింపు పలికే సమయం మొదలైందని,ఐదేళ్లలో మేనిఫెస్టోలో 30% హామీలను కూడా అమలు చేయకుండా అన్ని వర్గాలవారిని వంచించిన నిన్ను శాశ్వతంగా రాజకీయ సమాధి చేయడం ఖాయం అని,జగన్ రెడ్డికి ఓటు వేయొద్దని రక్తం పంచుకొని పుట్టిన సొంత చెల్లెళ్ల చెప్తున్నారని,తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాదు, ఈ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు తరిమి కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు అనంతరం బాణసంచా కాల్చారు.ఈ కార్యక్రమం లో టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు, హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, ఇప్పిలి జగదీష్, మెండ దమయంతి, పోలాకి షణ్ముఖ్ రావు,దల్లి ప్రసాద్ రెడ్డి, సోదిముడి శివకిరణ్, ప్రఫుల్ల కుమార్ పరిడ,ధోని బుజ్జి, సాధు జోగారావు, బొడ్డేపల్లి లచ్చు, ధవల రామారావు, బర్నాన నాగేశ్వరరావు,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐతమ్‌లో ముగిసిన ఎఫ్‌డిపి

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్థిక సహకారంతో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 11 నుండి 16వరకు 'సస్టైనబుల్ అండ్ రెసిలియంట్ సివిల్ ఇంజినీరింగ్ ప్రాక్టీసెస్' అనే అంశంపై జరిగిన అధ్యాపకుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఆధునాతన సాంకేతికత ద్వారా నిర్మాణ రంగంలో వస్తున్న పెను మార్పులను తెలుసుకొని విద్యార్థులకు తరగతి గదుల్లో భోదించుటకు ఈ అధ్యాపకుల శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర మెట్రోరైల్స్ ఎండి డాక్టర్ యు. జె.ఎం. రావ్ తరగతులను ప్రారంభించగా ఐఐటి భువనేశ్వర్ నుండి ప్రొఫెసర్ డాక్టర్ దినకర్ పి. డాక్టర్ సుమంత్ హల్దార్, ఎన్ఐటి వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.ఆర్. రవికుమార్, జమ్ము ఐఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ చెంబులు, గుంటూరు విజ్ఞాన్ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకట్రావు, విశాఖపట్నం ఎయు ప్రొఫెసర్లు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.బాలప్రసాద్, పరిశ్రమ ల నుండి డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ బి.రవికుమార్, ఇండియన్ గ్రీన్బిల్డింగ్ కౌన్సి ల్ విజయవాడ నుండి డాక్టర్ సందీపని వజ్జె, ఐతమ్ ఎంబిఎ ప్రొఫెసర్ డాక్టర్ కె.వేణుగోపాలు రిసోర్స్ పర్సన్లుగా పాల్గొని 60 మంది అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్. శ్రీనివాసరావు, సివిల్ హెచ్ఓడి డాక్టర్ పి.దినకర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ వి. సౌజన్యవాణి, కో-కన్వీనర్లు డాక్టర్ హెచ్.రామ్మోహనరావు, వి.దివ్య, కో-ఆర్డినేటర్ జి.డి.ఆర్.నాయుడు పర్యవేక్షణలో ఈ శిక్షణా తరగతులు అత్యంత క్రమశిక్షణగా జరిగినందుకు నిర్వహకులకు డైరెక్టర్ నాగేశ్వర రావు అభినందించారు.

తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం మంజూరు

- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, రెవెన్యూశాఖ మంత్రి ధర్మానకు కతజ్ఞతలు

విశాలాంధ్ర-అరసవల్లి: జిల్లాలో అత్యధిక జనాభా కలిగిన తూర్పుకాపు సామాజిక వర్గ ప్రజల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరిందని తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. నగరంలోని నాగావళి హెూటల్‌లో తూర్పుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ మాట్లాడుతూ తూర్పుకాపు సామాజిక భవన నిర్మాణానికి 50 సెంట్ల స్థలం మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థలం మంజూరుకు అన్నవిధాలా సహకరించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ, రెవెన్యూశాఖ మంత్రి ధర్మానకు ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు. నాటి శ్రీరాములునాయుడు దగ్గర నుంచి నేటి వరకు తమ కులానికి సామాజిక భవన నిర్మాణానికి అనేక ప్రయత్నాలు సాగించామన్నారు. అయితే స్థల సేకరణ కష్టతరంగా మారిందని, గత ఎమ్మార్పో వెంకటరావు సహకారంతో సింగుపురంలోని గురజాడ కళాశాల పక్కన 50 సెంట్ల స్థలాన్ని పొందగలిగామని వివరించారు. తూర్పుకాపు సామాజిక వర్గ జాతి ఖ్యాతిని, ఔన్నత్యాన్ని చాటేలా భవన నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ తమ సామాజికవర్గం భవన నిర్మాణానికి స్థలం సాధించడంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బొత్స సత్యన్నారాయణ, రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుతో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కష్ణదాస్‌తో పాటు జిల్లాలోని శాసన సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. వైసీపీ యువవిభాగం జిల్లా అధ్యక్షులు ఎంవీ స్వరూప్ మాట్లాడుతూ తూర్పుకాపు సామాజిక భవనాన్ని నిర్మించి తమ జాతిలోని నిరుపేద విద్యార్థులకు, నిరుద్యోగ అభ్యర్థులకు, పేదలను ఆదుకునే దిశగా కషి చేస్తామన్నారు. తూర్పుకాపు భవన నిర్మాణానికి స్థలం కేటాయించిన మంత్రులు బొత్స సత్యన్నారాయణకు, ధర్మాన ప్రసాదరావుకు ఆ జన్మాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కె.ఎన్.ఎస్ వి ప్రసాద్ (హారికా ప్రసాద్), ఇజ్జాడ శివన్నారాయణ, గణేష్, వావిలాపల్లి జగన్నాధనాయుడు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వానకష్ణచంద్, అలుగుబిల్లి నాగభూషణం, టంకాల బాలకష్ణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడు మృతి

ఆస్తి తగాదాలే కారణం

విశాలాంధ్ర - మందస : అన్నదమ్ముల కోట్లాటలో తమ్ముడు మృతి చెందిన హృదయ విధారక సంఘటన మందస మండలం సొండిపూడి గ్రామంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సొండిపూడి గ్రామానికి చెందిన లైశెట్టి కుమార్, నీలాద్రి అన్నదమ్ములు కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాల నేపధ్యంలో ఇరువురు గొడవ పడ్డారు. అన్న కుమార్, నీలాద్రిని కర్రతో బలంగా కొట్టడంతో నీలాద్రి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు లాజిస్టిక్స్ పంపిణి చేసినట్లు ప్రధానోపాధ్యాయులు బారాటం కామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

పార్టీల కటవుట్లు తొలగింపు

విశాలాంధ్ర-కొత్తూరు... శనివారం నుండి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్ ప్రభావం కొత్తూరులో వెంటేనే కనిపించింది. కొత్తూరు నాలుగు రోడ్లు కూడలిలో నలువైపులా వైసీపీ, టీడీపీ పార్టీలు ఏర్పాటుచేసిన కట్అవుట్లు తోలుగుతున్నాయి. అధికారులు తొలిగించే వరకు చూడకుండా వీటిని ఏర్పాటు చేసిన వారే వాటిని తోలిగిస్తున్నారు కొత్తూరు నాలుగు రోడ్లు నాలుగు వైపుల సుమారు యాభై వరకు కట్అవుట్‌లు వివిధ రాజకీయ పార్టీలు ఏర్పాటు చేశాయి. ఇవి ఎన్నికల కోడ్ వల్ల తొలగించారు.

వంట నిర్వాహకురాలికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-జలుమూరు/సారవకోట: మండలంలోని మదనాపురం పంచాయతీ జరాలి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా పనిచేస్తున్న తవిటమ్మ కాలుజారి పడిపోవడంతో గాయాలు కాగా శస్త్రచికిత్స జరిగింది. ఆమె భర్త కిడ్నీ వ్యాధితో, కుమారుడు క్యాన్సర్తో బాధ పడుతున్నారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఉపాధ్యాయులు రూ.28 వేలు సేకరించారు. హెచ్ఎం. సోమేశ్వరరావు, ఎంఈవో వెంకటరమణ, ఎంఈవో-2 భూలక్ష్మి నగదును శుక్రవారం అందజేశారు.

ఎంఎస్‌పల్లిలో సీసీ రోడ్డుకు భూమిపూజ

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి: కంచిలి మండలం ఎంఎస్‌పల్లి గ్రామంలో గల కొత్తవీధి, రజకవీధి ప్రజలకు సౌకర్యవంతంగా జాతీయ ఉపాధిహామీ పథకం నిధులు మూడున్నర లక్షలతో కొత్తగా నిర్మాణం చేపడుతున్న సిమెంట్ రహదారికి ఎంపీపీ పైల దేవదాసురెడ్డి శనివారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనపల సురేష్, ఎంపీటీసీ బుడ్డెపు విశ్వనాధం, నల్లాన పెద్ది, బత్తుల ధర్మారావు, కృష్ణారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 51 కేసులు పరిష్కారం

విశాలాంధ్ర-సోంపేట : స్థానిక న్యాయస్థానాల ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్ కార్యక్రమంలో 51 కేసులు పరిష్కారం అయినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాసరావు, అడ్వకేట్ కళ్యాణిదేవి ఆధ్వర్యంలోను అలాగే జూనియర్ సివిల్ జడ్జి పరేష్‌కుమార్ అడ్వకేట్ కె.వి.వి.ప్రసాద్ ఆధ్వర్యంలో వేర్వేరు బెంచ్‌ల ద్వారా కేసులను కక్షిదారుల సమక్షంలో పరిష్కరించారు. ఇందులో 5 ఎక్సైజ్ కేసులు, రెండు మనోవర్తి కేసులు, 16 క్రిమినల్ కేసులు, 5 సివిల్ కేసులు, 23 బిఎస్‌ఎన్‌ఎల్ కేసులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే

- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు - పలాస ఆర్డీవో డా.భరత్‌నాయిక్

విశాలాంధ్ర-పలాస : అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా అధికారులు పని చేయాలని పలాస ఆర్డీవో డాక్టర్ భరత్‌నాయిక్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపిడివో, మున్సిపల్ కమిషనర్లతో ఎన్నికల నియమావళి అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భరత్‌నాయిక్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలలోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడవద్దని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీబ్యానర్లు, హెూర్డింగులు తొలగించాలని అధికారులకు ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఎవరైనా ఫిర్యాదు చేయదలిస్తే 6302384049 ఫోన్ నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సి విజిల్ యాప్స్ వంటి అనేక యాప్‌లపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

- జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శం కావాలి
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నేటి యువతకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయులని, అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు అన్నారు. శనివారం పొట్టిశ్రీరాములు 123వ జయంతి సందర్భంగా కలెక్టర్ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు జ్యోతి ప్రజ్వలనచేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులన్నారు. వారి జీవిత చరిత్ర భావితరాలకు ఆదర్శం కావాలి. అనుకున్న లక్ష్యాలను అధిగమించడానికి ప్రాణాలను కూడా పణంగా పెట్టిన మహెూన్నత వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అన్నారు. జీవితంలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలంటే పొట్టి శ్రీరాములు ఆదర్శం అన్నారు. భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహా పురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారిణి ఇ.అనురాధ, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షమ అధికారి ఎల్ అప్పారావు, కార్యాలయ సిబ్బంది మమత, జి.గణేష్, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

విశాలాంధ్ర-మందస : మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు కావాల్సిన పరీక్షా సామాగ్రి కుంటికోట నారాయణ పాఠశాల శనివారం అందజేశారు. ఈ పరీక్షా సామాగ్రిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షలు చక్కగా రాయాలని ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు ఎస్.గణేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ గణిత ఉపాధ్యాయులు సి.హెచ్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎస్.కిరణ్‌కుమార్, ఎం.చిత్రసేను, జి.భీమారావు, ఎం.దామోదరం, ఎం.లక్ష్మణరావు, అబ్రహం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల/అరసవల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, సంతబొమ్మాళి మండల్లాలోని మర్రిపాడు, మేఘవరం, వాలీవలస, వాడివాడ, పొన్నాడ, తామాడ తదితర గ్రామాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది పదోతరగతి విద్యార్థులకు అట్టలు, పరీక్ష సామగ్రి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పరీక్షలు పెద్ద సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. చదువుల్లో భవిష్యత్తులో రాణించాలంటే సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. పదోతరగతి విద్యార్థి దశకు ఎంతో కీలకమైనదని ఉపాధ్యాయులు అందించే సూచనలు, సలహాలు పాటించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి మీ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయుని సూచనలను నిశితంగా గమనించడం, మొత్తం పాఠ్యాంశాలను గ్రహించడం ద్వారా ప్రయోజనం పొందుతారని వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణను పాటిస్తే, వారు తమ పనులను సకాలంలో పూర్తి చేస్తారని తద్వారా భవిష్యత్‌లో వారు గొప్ప వ్యక్తులుగా వద్ధి చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తి సహకారం అందజేస్తాం

నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ళ రాజేష్

విశాలాంధ్ర-కవిటి: రానున్న ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం,భాజపా పార్టీల పొత్తు తో తెలుగుదేశం పార్టీ అత్యధిక మెజార్టీ సాధించాలని అందుకుగాను తన సహకారం తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయిలో అందజేస్తామని నియోజకవర్గ జనసేన నాయకులు లోళ్ళ రాజేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగలో జనసేన పార్టీ నాయకులు లోళ్ల రాజేష్ జన సైనికులతో వెళ్లి ఎమ్మెల్యే అశోక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో రాజేష్ మాట్లాడుతు రానున్న ఎన్నికలలో అందరు కలసి పని చేసి ఉమ్మడి అభ్యర్థి అశోక్ ను గెలిపిద్దామని రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయి

విశాలాంధ్ర-ఆమదాలవలస: త్రాగునీరు అవసరాన్ని గుర్తించి జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచి నీటి కొళా యి పథకాన్ని ప్రవేశపెట్టి రాష్ట్రంలో ప్రతి గ్రామంలో త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినే ని సీతారాం పేర్కొన్నారు. ఆమదాలవలస మండలం రామచంద్రాపురం మరియు పొన్నంపేట గ్రామాలలో గ్రామంలో సుమారు 90 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమానికి శనివారం స్పీకర్ తమ్మినేని సీతారామ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి తమ్మినేని శ్రీరామమూర్తి, జడ్పిటిసి బెండి గోవిందరావు, పిఏసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచ్ చల్లా ఉషారాణి, స్థానిక ఎంపీటీసీ రౌతు దామోదర్ నాయుడు, కొల్లి శ్రీను చల్లా కామేష్, తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి : ఎమ్మెల్సీ నర్తు

విశాలాంధ్ర-కవిటి : మారుమూల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక సంస్థల శాసనమండలి సభ్యులు నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని కరాపాడు గ్రామంలో 1.5 లక్షల రూపాయలతో మండల పరిషత్ నిధులతో మోటారు బోరును ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్ తో కలిసి ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ గ్రామాలలో త్రాగునీటికి అధిక ప్రాధాన్యత వైయస్సార్సీపి ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు కు గ్రామస్తులు సాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిఎం తిలక్, వైఎస్సార్సీపీ నాయకులు,పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అరుదైన బాంబే బ్లడ్ గ్రూప్‌ని దానం చేసిన జె.కాశి లోకేష్ రెడ్డి

రెడ్ క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ఎవరికైనా అవసరమైనప్పుడు దానం చెయ్యటానికి, లేదా మీకు అవసరమైనప్పుడు ఇతరులు మీకు దానం చేసేందుకు బ్లడ్ గ్రూప్ తెలియాల్సిన అవసరం ఉందని రెడ్ క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వర రావు శనివాసరం అన్నారు. సాధారణంగా ప్రపంచంలో పుట్టిన వారిలో ఎక్కువ బ్లడ్ గ్రూపులు ఏ.బి.ఓలలో పాజిటివ్ లేదా నెగెటివ్ అయి ఉంటుంది, ఎందుకంటే ఇవి సాధారణ గ్రూపులు. ఎబి నెగెటివ్ బ్లడ్ గ్రూప్, అలాగేసబ్ గ్రూప్ ఏ-1, ఏ-2 కాస్త అరుదైనవి. అన్నిటి కంటా అరుదైన రక్తవర్గం అయితే బాంబే బ్లడ్ గ్రూప్ అని చెప్పుకోవాలి. ఇది ఎంత అరుదైనది అంటే మన దేశంలో అతి కొద్దీ మందికి మాత్రమే బాంబే బ్లడ్ గ్రూప్ కలిగి ఉన్నారు. ప్రపంచంలో పది లక్షల మందిలో సుమారు పది మందికి మాత్రమే బాంబే బ్లడ్ గ్రూప్ ఉంటుందంటే ఇది ఎంత అరుదైనదో అర్థమౌతుంది. ఈరోజు అత్యవసర పరిస్థితులలో అడిగిన వెంటనే కాదనకుండా తన పనులను ఆపుకొని రక్తదానం చేసిన విశాఖ జిల్లా భీమిలీపట్నం కు చెందిన జె.కాశి లోకేష్ రెడ్డిని ఎంత అభినందించిన సరిపోదని శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష్యులు శాశపు జోగినాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం శివరాం పురం కు చెందిన లండ కృష్ణరావు గత కొంత కాలంగా కిడ్నీ చికిత్స నిమిత్తము స్థానిక మెడికవర్ లో చేరారు. శనివారం అత్యవసర పరిస్థితులలో బాంబే బ్లడ్ అవసరం కాగా రెడ్ క్రాస్ సభ్యులు నంది ఉమా శంకర్, శ్రీకాకుళం శ్రీ ధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్ పాలకొండ ప్రశాంత్, మదర్స్ లవ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రౌతు సుప్రజ లను కోరగా వారి సహకారంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తన రక్తపు సిరాను అందించిన లోకేష్ ను నగర వక్తలుతో పాటు, రెడ్ క్రాస్ ప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డా. సుధీర్, రెడ్ క్రాస్ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి, పోలుమహంతి శ్రీకాంత్, అనంతపల్లి నర్సింగ రావు, గుణాకర్, బి. సతీష్, డా. శ్రీకాంత్, సామాజిక సేవకులు ఉర్లం శివతేజ స్టార్ వాకర్ స్ క్లబ్ ప్రతినిధులు బి. దేవీ ప్రసాద్ పి. నాగేశ్వరరావు, రెడ్ క్రాస్ ఐ టెక్నీషియన్ సుజాత, టెక్నీషియన్ కోమలి, వెంకటేష్, బాబ్జి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నర్సింహమూర్తి

విశాలాంధ్ర - కాశీబుగ్గ : పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కుప్పిలి నర్సింహమూర్తి శనివారం విధుల్లో చేరారు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా ఉన్న ఈయన ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ పదోన్నతి పొందారు. కాగా నూతన ప్రిన్సిపల్‌కు అధ్యాపకులు అభినందించారు.

ప్లేట్‌లెట్స్ అందించి ఆదుకున్న చలపతి

విశాలాంధ్ర-సోంపేట : ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన కె.మోహనరావు అనే వ్యక్తి కొద్ది రోజులుగా నిర్మల క్లీనిక్‌లో చికిత్స పొందుతూ అనుకోకుండా మోహనరావు ప్లేట్‌లెట్స్ పది వేలు పడిపోవడంతో వైద్యుల సలహా మేరకు ప్లేట్‌లెట్స్ అవసరమని సంబంధిత రోగి బంధువులకు వైద్యులు తెల్పడంతో సోంపేట పట్టణంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావును సంప్రదించడంతో ఉద్దానం బ్లడ్ బ్యాంక్‌లో రోటరీ క్లబ్ సభ్యుడు సిఎస్ఆర్ చలపతిరావు తన ప్లేట్‌లెట్స్‌ను మోహనరావుకు సకాలంలో అందజేసి బాసటగా నిలవడంతో రోటరీ క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావుతో పాటు రోటరీ సభ్యులు, హృదయం ఫౌండేషన్ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిదులు, స్థానికులు, వైద్యులు చలపతిరావును అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఎమ్మెల్యే శాంతి

విశాలాంధ్ర-హిరమండలం : పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. హిరమండలం మేజరు పంచాయతీ మెండవీధి లో మెండ లహరి అనే అమ్మాయికి సీఎం రిలీఫ్ ఫండ్ 90 వేల రూపాయలు చెక్ ను పాతపట్నం శాసనసభ్యురాలు రెడ్డి శాంతి చేతుల మీదుగా శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యలయం పాతపట్నం లో అందజేశారు. ఈ సందర్భంగా మెండ లహరి తండ్రి శ్యాం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, పాతపట్నం శాసనసభ్యురాలురెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో హిరమండలం మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ మీసాల వెంకట రామ కృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు, జెసిఎస్ మండల కన్వీనర్ అందవరం సురేష్, సచివా లయం కన్వీనర్ సైలాడ పాపారావు, ఒంకుల కృష్ణ, ఉప సర్పంచ్ వెలమల బాలరాజు, పిలక తేజేశ్వరరావు తదితరులు.

సూపర్ సిక్స్‌పై ప్రచారం

విశాలాంధ్ర-కవిటి : టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని కపాసుకుద్ది పంచాయితీలో కొరికానపుట్టుగ, వడ్డిపుట్టుగ, ముత్యాలపేట, దిగువ కపాసుకుద్ది,ఎగువ కపాసుకుద్ది, పాతినపుట్టుగతోపాటు పలు గ్రామాల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పై ప్రచారం చేశారు. జనసేన కూటమి అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు పథకాలపై వివరించారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్రాయి వాసు యాదవ్,మణి చంద్రప్రకాష్, బెందాలం తిరుమలరావు, ప్రగడ కళ్యాణి, బెందాలం రాణి, లక్ష్మి, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ మురళీకృష్ణ స్వామి కల్యాణం

విశాలాంధ్ర -జలుమూరు : మండలం జోనంకి పంచాయతీ అబ్బాయిపేటలో వెలసిన శ్రీ మురళీకృష్ణ స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, మధ్యాహ్నం అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం గ్రామస్తులు భక్తులు కదలి రాగా గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రుత్వికులు చామర్తి సీతారామాచార్యులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

అప్పలసూరి స్మారక సభను విజయవంతం చేయండి

సి పి ఎం ఎల్ న్యూ డేమక్రసి జిల్లా కార్యదర్శి ప్రకాష్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... విప్లవ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ మామిడి అప్పలసూరి 27వ వర్ధంతి సందర్భంగా, ఈ నెల 21న ఉదయం 10 గంటలకు నరసన్నపేట మండలం కోమర్తి అమరవీరుల స్థూపం వద్ద కామ్రేడ్ ఏ.యస్ స్మారక సభను విజయవంతం చేయాలని సిపిఎం ఎం ఎల్ న్యూ దేమక్రసి జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ కోరారు. శనివారము సంతబొమ్మాళి మండలం వడ్డితాండ్ర గ్రామంలో సభ జయప్రదం చేయాలని నిర్వహించిన ప్రచార ర్యాలీలో ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే , ధైర్యశాలి కామ్రేడ్ గుమ్మడి లచ్చయ్య 1970 ఫిబ్రవరి 4న, కామ్రేడ్ అప్పలసూరి జీవిత సహచరిగా ఉంటూనే పోరాటాలకు అండగా నిలబడిన కామ్రేడ్ మామిడి లచ్చెమ్మ 1987లో అమరత్వం చెందారనీ, ఈ ముగ్గురు అమర వీరులకూ కామ్రేడ్ ఏ.యస్ వర్ధంతి రోజున మార్చి 21వ తేదీన వీరి స్మారక స్థూపం వద్దనే స్మృత్యంజలి ఘటించి స్మరించుకోవడం నేటి విప్లవోద్యమ చారిత్రిక బాధ్యతగా సిపిఐ (యం.యల్) న్యూ డెమోక్రసీ పార్టీ శ్రీకాకుళం జిల్లా కమిటి భావిస్తోందని ఆయన అన్నారు. కోమర్తి విప్లవోద్యమ అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దామనీ అమరులు నడిచిన విప్లవ త్యాగాల బాటలో పయనిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఏఐకెయంయస్ జిల్లా నాయకులు నంబారి వెంకటరావు, ప్రగతిశీల మహిళా సంఘం (పీ.ఓ.డబ్ల్యూ) జిల్లా అధ్యక్షులు యస్. కృష్ణవేణి, పీ.వై.యల్ జిల్లా కన్వీనర్ సార జగన్, కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు కారుణ్య కేశవ, మండల గన్ను, కారుణ్య ఖెత్రో, సభద్రమ్మ, అనంత సుభద్రమ్మ, కారుణ్య హేమలత, అనంత అడివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మళ్ళీ వైఎస్సార్సీపీ పాతపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి శాంతి

విశాలాంధ్ర-హిరమండలం : రాష్ట్రముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శనివారం వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను, ఎంపీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారు. దీనిలో భాగంగా పాతపట్నం నియోజకవర్గం ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచిన ఎమ్మెల్యే రెడ్డి శాంతికే మళ్ళీ టికెట్ ప్రకటించడంతో వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు శనివారం పాతపట్నంలోని ఎమ్మెల్యే శాంతి క్యాంప్ కార్యాలయం వద్ద సందడి చేశారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకులతో కలిసి సీఎం జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాంతి మాట్లాడుతూ 2019లో నియోజకవర్గంలో 16వేలు ఓట్లు మెజారిటీతో నన్ను నా ఆడపడుచులు, నా అన్న దమ్ములు గెలిపించుకున్నారని ఈ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తున్నారని కొనియాడారు. అలాగే ఎంపీ అభ్యర్థిగా పేరాడ తిలక్ ను సీఎం ఖరారు చేశారని, పాతపట్నం నియోజకవర్గంలో ఏ నియోజకవర్గంలో రాని మెజారిటీ తిలక్ కు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. నాపైన నమ్మకంతో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా రెడ్డి శాంతి రెండవ సారి అవకాశం కల్పించిన ముఖ్య మంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. నన్ను ఆశీర్వదించి గడిచిన ఎన్నికలలో విజయాన్ని అందించిన నాపాతపట్నం నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డిసారథ్యంలో మన పాతపట్నం నియోజకవర్గంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 2019-2024 మధ్య జరిగినంత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మునుపెన్నడూ జరగలేదని, జగనన్న ఆశీర్వాదంతో పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నదిపించామని సగర్వంగా చెప్పున్నానన్నారు. ఈ అభివృద్ధి సంక్షేమ ఫలాలు ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికలలో కూడా మీ అమూల్యమైన ఓటు ను ఫ్యాన్ గుర్తు పై వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించి మళ్ళీ సీఎం ను వై.యస్.జగన్మోహన్ రెడ్డిని చేద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే వెంట మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, పిఎసిఎస్ అధ్యక్షులు ఎవి ఎ సూర్యమ్, పి అర్జున్, ఎం శ్యాం సుందర్, ఎం ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మామూళ్లు మత్తులో అధికారులు...

హాస్టళ్లలో విద్యార్థులకు సంక్షేమం కరువు

విశాలాంధ్ర-మందస : మండలంలో పలు గిరిజన, గిరిజనేతర సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో వసతి గృహాల్లో విద్యార్థులకు మెను అమలు కావడం లేదు. తాము పెట్టిందే తినాలి అన్న చందంగా నిర్వహణ తయారైంది. హెచ్.ఎంలు, డిప్యూటీ వార్డెన్లు కుమ్మక్కై నెలసరి మామూళ్ల ఉన్నతాధికారులకు తనిఖీలు లేకుండా చెల్లింపులు చేయడంతో వసతి గృహాలు దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. మండలంలో కిల్లోయి, చీపి గ్రామాల్లో ఉన్న గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలల్లోను, పట్టులోగాం గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో గత 2 నెలలుగా మెను సక్రమంగా అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు ఇవ్వాల్సిన గుడ్లు, చికెన్ పూర్తిగా ఇవ్వడం లేదు. స్థానికంగా ఉన్న గ్రామాలకు ప్రతీ రోజు విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోతున్నారు. పాఠశాలలో భోజనాలు సరిగా లేక ఇంటి బాట పడుతున్నారు. విద్యార్థుల హాజరుశాతం పూర్తిస్థాయిలో లేకపోయినా బిల్లులు మాత్రం వార్డెన్లుకు చెల్లింపులు జరిగిపోతున్నాయి. మందసలో ఉన్న బి.సి బాలికల వసతి గృహం, వి.జి.పురంలో ఉన్న బి.సి బాలుర వసతి గృహం పూర్తిగా గాలికి వదిలేశారు. హాస్టళ్లలో ఉన్న సిబ్బందికి నిర్వహణ బాధ్యతలు అనాధికారికంగా అప్పజెప్పి విధులకు డుమ్మా కొడుతున్నారు. వి.జి.పురంలో ఉన్న కస్తూర్బా బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో రోజువారి మెను సక్రమంగా అమలు జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాణ్యత లేని ఆహారం బాలికలకు పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రెండు పాఠశాలలో నిర్వహణ లోపం ఎక్కువుగా ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు తనిఖీలు పూర్తిగా లేవు. బాలికలకు సక్రమంగా పౌష్టికాహారం ఇవ్వకపోవడంతో అనారోగ్యం పాలవుతున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పి.వో స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్వర్గధామ రథం ప్రారంభం

- ఉచిత స్వర్గధామ రథాన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలి
- ప్రముఖ వైద్యులు డా. కె. సుధీర్

విశాలాంధ్ర-అరసవల్లి: ఉచిత స్వర్గధామ రథాన్ని నిరుపేద ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ వైద్యులు డా. కె. సుధీర్ అన్నారు. సుమారు ఏడున్నర లక్షల విలువగల స్వర్గ రథాన్ని శనివారం నగరంలోగల ఏడురోడ్ల కూడలిలో గల బ్లడ్ బ్యాంకు వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన దాతలు విశ్రాంత తహశీల్దార్ సిహెచ్ సుభాషిణి, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమం సంఘం శ్రీకాకుళం సభ్యులందరూ కలసి రథాన్ని అందించటం మాటలకందని విషయమన్నారు. నిస్వార్థ సేవలకు చిరునామ, ఇండియన్ రెడ్ క్రాస్ శ్రీకాకుళం అని, ఈ రోజు నిరుపేద ప్రజలందరికోసం అలోచించి విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమ సంఘం, శ్రీకాకుళం వారి వితరణతో స్వర్గధామ రథాన్ని రెడ్ క్రాస్ కు అందించటం హర్షణీయమన్నారు. ఇందులో భాగంగా ఉచిత స్వర్గధామ రథాన్ని అందరికోసం పలువురు వక్తలతో ప్రారంభించారు. అనంతరం పూర్వపు జాయింట్ కలెక్టర్ పి. రజనీకాంత్ మాట్లాడుతూ మనమంతా చివరకు చేరుకునేది ఒకే గమ్యానికని, ముందుగా రథాన్ని ప్రారంభించి రెడ్ క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వర రావు కు వక్తలు చేతుల మీదుగా తాళాలను అందించారు. ఈ సందర్భంగా పలువు వక్తలు రెడ్ క్రాస్ చైర్మన్ జగన్ మోహన్ రావు, రెడ్ క్రాస్ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. రెడ్ క్రాస్ కార్యదర్శి బి. మల్లేశ్వర రావు మాట్లాడుతూ ఉచిత స్వర్గధామ రథం అవసరమైన ప్రజలందరూ ఇండియన్ రెడ్ క్రాస్ శ్రీకాకుళం వారిని నేరుగా గాని, 9010273741, 91330085885 లేదా 08942 226555 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పి. శ్రీకాంత్, కళ్యాణ్ చక్రవర్తి, డా. నిక్కు అప్పన్న, ప్రధాన దాతలు సిహెచ్ సుభాషిణి, డి. చంద్రశేఖర్ రావు, ఎం.కాళీప్రసాద్, ఎం.సీత రామ్ మూర్తి,ఎం సురేష్ , శ్యాము , ఆంజనేయులు, లోకేశ్వర రావు, పి.రాంబాబు తదితర కార్యవర్గ సభ్యులు, రెడ్ క్రాస్ సభ్యులు చిన్మయ రావు, బి. సతీష్, నంది ఉమా శంకర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జామి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి... నేడు ఎల్లమ్మ జాతర

విశాలాంధ్ర-పలాస : కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తులపాలిట కొంగుబంగారం జామి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఎల్లమ్మజాతర స్థానిక ఎల్లమ్మవీధిలో వెలసి ఉన్న ఆలయంలో జరుగుతుంది. ప్రతి ఏటా శివరాత్రి దాటిన తొమ్మిదోరోజున ఎల్లమ్మజాతర నిర్వహిస్తుం టారు. తర్లాకోట జమిందార్లు కాలం నుంచి సాంప్రదాయపద్దతిలో ఎల్లమ్మజాతరను నిర్వహిస్తారు. మన రాష్ట్రంతో పాటు ఒడిసా, ఛత్తీస్ఘడ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు యాత్రకు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకొని పడి సమర్పించుకునే ఆచారం ఉంది. ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆవాహన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మేళతాళాలు, తప్పెటగుళ్ళు, డప్పు వాయిధ్యాలతో అమ్మవారి ఆలయంలో పూజలు జరి పారు. అమ్మవారి జంగెడిని ఆలయ నిర్వాహకులు కొల్లకోట శ్రీనివాసరావు తలపై పెట. కొని సాంప్రదాయ పద్దతిలో తర్లాకోటలో ఉన్న జమిందారి వంశస్థులు పూజలు చేసే అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. శనివారం సింధూర పంట(సింధూరం తీయడం)తో అమ్మవారి జాతర ప్రారంభం అవుతుంది. జమిందారి వంశస్థులు తొలి పూజ జరపడంతో పాటు అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేసే కార్యక్రమం నిర్వహించిన అనంతరం భక్తులకు ఎల్లమ్మను దర్శనం కల్పిస్తారు. అమ్మవారికి పడి(బియ్యం. వేప ఆకులు) ముడి కట్టి నిర్వహిస్తారు. మన రాష్ట్రంతో పాటు ఒడిసా, ఛత్తీస్ఘడ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు యాత్రకు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకొని పడి సమర్పించుకునే ఆచారం ఉంది. మేళతాళాలు, తప్పెడగుళ్ళు, డప్పు వాయిధ్యాలతో అమ్మవారి ఆలయంలో పూజలు జరిపారు. అమ్మవారి జంగెడిని ఆలయ నిర్వాహకులు కొల్లకోట శ్రీనివాసరావు తలపై పెటకొని సాంప్రదాయం పద్దతిలో తర్లాకోటలో ఉన్న జమిందారి వంశస్థులు పూజలు చేసే అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. శనివారం సింధూర పంట(సింధూరం తీయడం)తో అమ్మవారి జాతర ప్రారంభం అవుతుంది. జమిందారి వంశస్థులు తొలి పూజ జరపడంతో పాటు అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేసే కార్యక్రమం నిర్వహించిన అనంతరం భక్తులకు ఎల్లమ్మను దర్శనం కల్పిస్తారు. అమ్మవారికి పడి(బియ్యం, వేప ఆకులు) ముడి కట్టి ఆలయ శిఖరంపై విసరడం ఆచారంగా వస్తుంది. లక్షలాది మంది భక్తులు ఆదివారం వేకువజాము నుంచి రాత్రి 12 గంటల వరకూ దర్శనం చేయడానికి తగు ఏర్పాట్లు చేసారు. అమ్మవారి ఆలయాన్ని ఎన్నడూ లేని విధంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తర్లాకోట జమిందారుల నుంచి కొల్లకోట వంశీయులు ఆలయ అర్చకులుగా నిర్వహిస్తు వస్తున్నారు.

యాత్రకు బారీ బందోబస్తు... యాత్రకు భక్తులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలిసులు బారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కాశీబుగ్గ సిఐ విజయ్ ఆనంద్ తెలిపారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎల్లమ్మ గుడీ వరకు రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వాహనాలు కాంప్లెక్స్ వద్ద నిలిపి వేయాలని, ప్రజలు, వాహన చోదకులు సహకరించాలని కోరారు. యాత్ర ఏర్పాట్లును మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్, కాశీబుగ్గ ఎస్సై పారి నాయుడు పరిశీలించారు.

మంచినీటి బోర్‌ల ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర -సంతబొమ్మాళి : ఈ మండలము మరువాడ పంచాయతీలో దిబ్బల మురువాడ, రెడ్డిక మరువాడ గ్రామాలకు మంచినీరు అందించేందుకు సర్పంచ్ సురాడ ధనలక్ష్మి దాసురాజు శనివారం ఉదయం 10:30 గంటలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి వస్తుందంటే తాగునీటి సమస్య తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవని , రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని , మంచినీటి ఇబ్బందులు సమస్యలు రాకుండా తీరప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందే విధంగా బోర్లు వేయటం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సుగ్గు.సీతయ్య, వార్డ్ మెంబర్ తిప్పాన. వసంత రెడ్డి, సూరాడ. పున్నయ్య, మాజీ సర్పంచ్ సూరాడ. కొర్లయ్య, గ్రామ పెద్దలు సూరాడ.కృష్ణమూర్తి, గంట. లోకేష్, చిన్నారావు, మహిళలు పాల్గొన్నారు.

బీజేపీలోకి సిరిపురం తేజేశ్వరరావు

కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పురంధేశ్వరి

విశాలాంధ్ర -హిరమండలం / పాతపట్నం : పాతపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు శనివారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. శనివారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ భాజపా అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆయనకు కాషాయ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. అనంతరం ఆమె చేతుల మీదుగా పార్టీ క్రియాశీల సభ్యత్వాన్ని తేజేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ.... ప్రధాని మోదీ నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరిన తేజేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. బీజేపీ సిద్ధాంతాలు, భారత దేశాన్ని విశ్వ గురువుగా నిలబెట్టిన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వ పటిమ నచ్చి తాను పార్టీలో చేరానని తేజేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సిరిపురం తేజేశ్వరరావు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా గత మూడేళ్లుగా పాతపట్నం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేయటం కోసం పాతపట్నం నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పని చేసుకున్న తేజేశ్వరరావు సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల రోజునే బీజేపీలో చేరటం ప్రాధాన్యత సంతరించుకుంది. తెదేపా, జనసేన, బీజేపీ పొత్తులు కుదిరిన నేపథ్యంలో తేజేశ్వరరావును పాతపట్నం నుంచి బీజేపీ అభ్యర్థిగా నిలిపే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అనే దానిపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ ఉన్న సమయంలో తేజేశ్వరరావు ఓ బహుళ జాతి నిర్మాణ సంస్థకు గుజరాత్ రాష్ట్ర అధిపతిగా వ్యవహరించారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను గడువుకు ముందే పూర్తి చేయించినందుకు గాను పలు సందర్భాల్లో మోదీ చేతులు మీదుగా పురస్కారాలు, ప్రశంసలు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పాతపట్నం నుంచి బీజేపీ తరఫున మిత్ర పక్షాల అభ్యర్థి అయ్యే అవకాశాలు ఉన్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

పదో తరగతి విద్యార్థులకు ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలి

పోలీసులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఈనెల 18 నుండి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న పదోతరగతి పరీక్షా కేంద్రాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సునాయాసంగా చేరుకునే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీసు అధికారులకు కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు అధ్యక్షతన ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది వ్రాయనున్న ఈ పరీక్షల్లో తల్లిదండ్రులతో ద్విచక్ర వాహనాలు, కార్లు ద్వారా పరీక్ష కేంద్రాలకు వెళ్ళేముందు కేసులు బుక్ చేయడం, ఆకస్మికంగా పోలీసులు ఆపడం వంటి చర్యలు చేపట్టొద్దని సూచించామని అన్నారు. ఏ ఒక్క విద్యార్థి ట్రాఫిక్ ఇబ్బందులతో పరీక్షలు వ్రాయలేక పోయారన్న మీమాంస తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలతో అడుగులు వేయాలని సీతారాం సూచించారు.

నూతన సచివాలయం ప్రారంభం

- పేదప్రజలకు జగనన్న ఒక వరం

జడ్పీ చైర్పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్‌చార్జ్ పిరియా విజయసాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి: పేద ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్ మోహన్ రెడ్డి ఓ వరమని అర్థాతే ప్రమాణంగా మధ్యవర్తిత్వం కు స్వస్తి చెప్పి నేరుగా లబ్ధిదారులకు ప్రభుత్వ ఫలాలు చేరేలా చర్యలు చేపట్టి ప్రతి ఇంటిలో ఓ పెద్ద కుమారుడిలా భాధ్యతగా నిలవటం రాష్ట్ర ప్రజలు గర్వించ దగ్గ విషయమని జడ్పీ చైర్పర్సన్, నియోజకవర్గ వైసిపి ఇన్చార్జ్ పిరియా విజయసాయిరాజ్ ప్రజలకు తెలియజేశారు. ఈమేరకు శనివారం వరక గ్రామ పంచాయతీలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ 40 లక్షల రూపాయలు నిధులతో నిర్మించిన నూతన సచివాలయాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావుతో కలిసి జిల్లా పరిషత్ చైర్పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పిరియా విజయ సాయిరాజ్ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ సావిత్రి శ్యాం సుందర్ పురియ, ఎంపీటీసీ సభ్యులు పిరియా కృష్ణ రావు, శ్రీకాంత్ పురియా, బెండి జగదీష్, బిసాయి జగదీష్, దేవరాజ్ పురియ, మాదిన వెంకట్, తమరల కామరాజు, మాదిన జవహర్, నర్తు దుదయ్య, నర్తు సోమేశ్, నర్తు శివాజీ, భాస్కర్ రావు, బలగ రాజేశ్వరరావు, వైయస్సార్సీపి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర-కవిటి: అమరజీవి పొట్టి శ్రీరాములు అని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ పండి బిందు మాధవి అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో పొట్టి శ్రీరాములు 123 వ జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ బిందు మాదవి పూలమాలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం తెలుగు ప్రజలు ఒక రాష్ట్రంగా ఉండాలని ఆంధ్ర రాష్ట్ర సాధనకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చర్ల : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జయంతి సభను ఏర్పాటు చేయటం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్. కె.వి.జి.డి బాలాజీ గారు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిగా ఏర్పడిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కోసం తన ప్రాణాలను సహితం లెక్క చేయకుండా తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి కృషి చేసిన మహానుభావుడు పొట్ట శ్రీరాములు అని మరియు ఆయనను స్మరించు కోవాల్సిన అవసరం తెలుగు వారందరికీ ఉందని అన్నారు. ఆర్.జె.యు.కె.టి సంచాలకులు ఆచార్య. కె.వి.జి.డి బాలాజీ గారు మరియు ఓఎస్డీ. ఆచార్య ఎల్.డి. సుధాకర్ బాబు, ఏవో శ్రీ ముని రామకృష్ణ, డీన్. శ్రీ. మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్.వో. డా. అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ శ్రీ గేదెల రవికుమార్ ఎన్.ఎస్. ఎస్ కో ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుందరావు, పీవోలు, డా.వి.సింహాచలం, డా.జి. ఈశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందివాలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ఐటీ విభాగంపై శిక్షణ

విశాలాంధ్ర-పలాస: మే 13న జరగనున్న పలాస నియోజకవర్గం అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికలలో విధులు నిర్వహించే సిబ్బందికి ఎన్నికల కమిషన్ రూపొందించిన ఐటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. సోమవారం పలాస తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని పలాస ఆర్డిఓ డాక్టర్ భరత్ నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పనిచేయాలని కోరారు. ఎన్నికల కోడ్ ను పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని చెప్పారు. ఎన్నికలు పూర్తి అయ్యేవరకు మండలకోడ్ ఆఫ్ కాంటాక్ట్ టీమ్ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన ఐటీ కి సంబంధించిన సర్వీస్ ఓటర్ పోర్టల్, అఫిడవిట్ పోర్టల్ , సాక్ష్యం యాప్, సి విజిల్ యాప్, ఓటర్ హెల్ప్ లైన్, బూత్స్ యాప్, అబ్జర్వర్ మేనేజ్మెంట్ పోర్టల్, వెబ్ కాస్టింగ్ అండ్ సిసిటీవీ ఇన్ పోలింగ్ స్టేషన్స్, ఎలక్షన్ ట్రెండ్స్ టీవీ, తదితర అంశాలపై స్టాటస్టిక్ సర్వెలియాన్స్ టీమ్ కి, ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ కి, వీడియో వ్యూయింగ్ టీమ్ కి, వీడియో సర్వెలియాన్స్ టీమ్ సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

నగరంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

2 కి.మీ కవాతులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కేంద్ర పోలీసు దళాలు జిల్లాలో పని చేస్తాయని జిల్లా ఎస్పీ జి.అర్.రాధిక తెలిపారు. సుమారు 400 మంది రిజర్వ్ పోలీస్ దళాలు (ఆర్పిఎఫ్), స్థానిక పోలీసులు నగరంలో శనివారం సాయంత్రం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. దీనిని కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ ప్రారంభించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి పొట్టి శ్రీరాములు జంక్షన్ వరకు నిర్వహించిన ఈ కవాతులో కలెక్టర్, ఎస్పీ, నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కేంద్ర దళాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని అన్నారు. వీరందరికీ వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. జిల్లా పోలీసులు వారికి వసతి సౌకర్యాలు అందించాలని, లైజనింగ్ అధికారులను నియమించి, ఎటువంటి అవసరం ఏర్పడినా వెంటనే తెలియజేయాలని సూచించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగానే జిల్లాలో ఫ్లాగ్‌మార్చ్‌లు, రూట్ మార్చ్‌లు, చెక్ పోస్టల వద్ద వాహన తనిఖీల వంటి విధులు ఎన్నికలు పూర్తయ్యేంత వరకూ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా పరిస్థితులు, భౌతిక స్వరూపం, స్థితిగతులను కేంద్ర దళాలకు మ్యాప్ ద్వారా ఎస్పీ వివరించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రేమ కాజల్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్డిఓ సిహెచ్ రంగయ్య, డీఎస్పీలు ఎల్. శృతి, వై. శేషాద్రి నాయుడు ఆర్పిఎఫ్ ఎస్పీ, డీఎస్పీలు, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

తమ్మినేనికి లైన్ క్లియర్.... సుడిగాలిలో 'సువ్వారి'

విశాలాంధ్ర-పొందూరు: రాష్ట్రంలో ప్రతిష్టాత్మక నియోజకవర్గంగా ఆముదలవలస ఎమ్మెల్యే స్థానానికి అధికార పార్టీ అభ్యర్థుల చిక్కుముడి వీడింది. మూడేళ్లగా వైసీపీ టికెట్ కోసం ఆశించిన సువారి గాంధీకి మొండి చెయ్యి చూపింది. అధిష్టానం ఆదరణ సువారికి ఉందని ఆ వర్గాలు ప్రచారాలు చేసుకుంటున్నాయే తప్ప? ప్రయత్నంలో చుక్కెదురైంది. జిల్లా నాయకులతో పాటు పక్క జిల్లా నేతలు అండతో రాష్ట్ర పార్టీ ముఖ్యనేతల ద్వారా టికెట్ సువారికి అంటూ విస్తృత ప్రచారాలు సాగించారు. టిక్కెట్ తమకే వస్తుందని నమ్మకంతో సువారికి చూపులే మిగిలాయి. అంతిమంగా అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని. ఫ్యూచర్ చాలా ఉన్నందున భవిష్యత్తు అవకాశం ఉందని అధిష్టానం తెలియజేసినట్లు పరిశీలకులు స్పష్టంగా వెల్లడించారు. రాష్ట్రంలో ఏడోవ విడతలో పోలింగ్ నిర్ణయించడం జరుగుతుందని సీఈవో వెల్లడించడంతో ఒక్కసారి సువారీ వర్గం అవాక్కయ్యారు. మే 13న ఎన్నికలు, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రకటనతో ఎన్నికలు ప్రక్రియ మొదలైంది. ఎన్నికల ప్రక్రియ సమార్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఈవో వెల్లడించడంతో ఎన్నికల కోడ్- కోడి కూతగా నగరా ముగింది. ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసే అభ్యర్థులు ఖరారు కావడంతో ఎన్నికల యుద్ధభేరికి శనివారం సాయంత్రం మండలం లక్ష్మంపేట, జోగిన్నపేట గ్రామంలోని గడపగడపకు ప్రచారంలో భాగంగా స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల యుద్ధానికి సిద్ధమై ప్రచార బేరిని ముగించారు. ముందుగా తనదైన శైలిలో వైయస్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళిలు అర్పించిన అనంతరం పురవీధుల్లో ఇంటింటా ప్రభుత్వ పథకాలు అందయా లేదా అనేది విపులంగా అడిగి తెలుసుకున్నారు. పురవీధుల్లో మహిళలు మంగళహారతులు నుదుట విజయ తిలకం దిద్ది మీ వెంట మేముంటాం గెలుపే ధ్యేయంగా పనిచేస్తామంటూ హామీలు ఇచ్చారు. వందలాదిగా పార్టీ కార్యకర్తలు నేతలు ప్రచార బేరి మోగించారు. వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంతో సిద్ధమైప్రచారాన్ని హోరెత్తించింది. కానీ ఇంకా ఆగని టిక్కెట్లు యుద్ధం శనివారం ప్రకటించడంతోఅభ్యర్థుల వ్యూహ ప్రతివ్యూహాలు ప్రారంభమైంది, ఇదిలా ఉండగా వైసీపీకి సువారి కుటుంబం గుడ్ బై చెప్పింది పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి పదవులకు జిల్లా గ్రంధాలయాలు చైర్మన్ పదవికి సీటు రావకపోవడంతో తీవ్ర అవేదనకు గురై రాజీనామాలు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రానున్న ఎన్నికలలోఇండిపెండెంట్ అభ్యర్థిగాబరిలో ఉంటారని స్పష్టంగా వెల్లడించారు.

వాలీబాల్ క్రీడాకారునికి సంతాపం

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ గ్రామానికి చెందిన రాష్ట్రస్థాయి వాలీబాల్ సీనియర్ క్రీడాకారులు పూడి శ్రీకృష్ణ గత కొద్దిరోజులుగా మూత్రపిండం వ్యాధితో బాధపడుతూ శనివారం వేకుజామున తుది శ్వాస విడిచారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రగడ పుట్టుగ వాలీబాల్ క్రీడాకారులు ప్రగడ పుట్టుగ క్రీడా ప్రాంగణంలో సంతాపం తెలియజేశారు. వాలీబాల్ క్రీడాకారుడు పూడి శ్రీకృష్ణ యొక్క క్రీడా నైపుణ్యం గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయికి చేసిన వాలీబాల్ క్రీడకు చేసిన సేవలను జిల్లా వాలీబాల్ జాయింట్ సెక్రెటరీ బల్లెడ రమేష్ క్రీడాకారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బెందాలం కిషన్ బాబు, బద్ద బలరామ్, సుందర్ రావు తోపాటు ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

వైసీపీకి సువ్వారి గాంధీ గుడ్ బై...

- తన అనుచరులతో రాజీనామా
- పార్టీకి విధేయుడుగా పనిచేశా..
- సీఎం జగన్ మాట తప్పారు....
- వారిరువురి చీకటి ఒప్పందాలు...

విశాలాంధ్ర-ఆమదాలవలస: వైసిపి సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే టికెట్ ఆశా వాహుడు వైయస్సార్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పొందూరు మండలం నాయ కుడు సువ్వారి గాంధీ వైసీపీ ప్రాథమి క సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు శనివా రం కార్యాలయం వద్ద తన అనుచరులతో కలిసి విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ వైసిపి పార్టీకి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తు స్నట్టు ప్రకటించారు. వైసిపి పార్టీకి ఎంతో విధేయుడు గా పని చేశానని పార్టీ బలోపే తా నికి ఎంతో కృషి చేశానని అయినప్పటికీ పార్టీ తనను గుర్తించక పోవడం పైన మండిపడ్డా రు. 2019 ఎన్నికల సీట్ల పంపకాల సమయం లో రాజకీయ సమీకరణల వల్ల తమ్మినేని టిక్కెట్ కేటాయిస్తున్నానని 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిక్కెట్ నీదేనంటూ నాడు జగన్మో హన్ రెడ్డి హామీ ఇచ్చారని నేడు ముఖ్యమం త్రి జగన్మోహన్ రెడ్డి మాటతప్పి మడం తిప్పా రని మండిపడ్డారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా పొందూరు మండలం ఎంపీపీగా పార్టీని బలోపేతానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. అర్హులైన వారి పింఛ న్లు తొలగింపు తో పాటు.. సర్పంచులు చెక్ పవర్ రద్దు చేస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించి వాటిని పునర్దించి పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశానని అయినప్పటికీ తన సేవలను పార్టీ గుర్తించక పోయినప్పటికీ ప్రజలు మాత్రం తనను గుర్తించా రన్నారు. ఇసుక దోపిడి వందల కోట్ల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి పార్టీ అండగా నిలిచి టికెట్ కేటాయించడం చూస్తుంటే అవినీతికి పాల్పడిన వారికే వైసీపీ అండగా నిలుస్తుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాట తప్పను మడం తిప్పను పదేపదే చెప్తుంటారని తన టిక్కెట్ విషయంలోమాట తప్పి మడం తిప్పారని మండిపడ్డారు. జగ న్మోహన్ రెడ్డి ఎంతో ఉన్నత ఆశయం గల వ్యక్తిని భావించి పార్టీ విధేయుడు గా పని చేశారని అయినప్పటికీ తన సేవలు గుర్తించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తికి పార్టీ టిక్కెట్ ఇస్తే నూటికి నూరు శాతం ఓటమి చెందుతారని నివేదికలు ముఖ్యమంత్రి వద్ద ఉన్నప్పటికీ టికెట్ కేటాయించారు అంటే ఆమదాలవలస వైసీపీని భూస్థాపితం చేయడమేనని భావించ వలసి ఉంటుందన్నారు. బావ బామ్మర్ది చీక టి ఒప్పందం కుదుర్చు కున్నారని పత్రికల ముందుకు వచ్చి ఆస్కార్ లెవెల్ ల్లో ఇద్దరు నటిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ కు అందించిన అఫిడవిట్ లో తప్పుడు ధ్రువీకరణ పత్రాన్ని చూపించారని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బయట పెడితే ఇక్కడ విదిలేని పరిస్థితుల్లో తెలుగుదేశం నాయకులు హడావుడి చేసారె తప్ప చిత్తశుద్ధి లేదన్నారు. వారి ఆరోపణ నిజమైతే కోర్టుకు వెళితే అసలు నిజాలు బయట పడతాయి కదా అని ప్రశ్నించారు. వీరిద్దరి మధ్య చీకటి ఒప్పందం జరిగాయని ఆరోపించారు. ఆమదాలవలస నియోజక వర్గ ప్రజలు ఆత్మగౌరవం గల

వారిని ప్రజలందరూ సహకరిస్తే రానున్న ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని గాంధీ ప్రకటించారు. ఇంటింటికి వెళ్లి చీకటి ఒప్పందాలపై ప్రజలకు వివరిస్తారని అందరం ఏకమవు దామని ఆమదాలవలస ఆత్మ గౌరవాన్ని కాపాడుదామని గాంధీ పిలుపునిచ్చారు. ముందుగా రాజీనామా పత్రాలను ప్రదర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ సువ్వారి దివ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సువ్వారి సువర్ణ, ఢిల్లీ శ్వర రావు, కోరుకొండ సాయి, పేడాడ వైకుంఠం, బొడ్డేపల్లి మన్మధరావు, తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమ నిబంధనలపై శిక్షణ

విశాలాంధ్ర-కవిటి: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందికి ఎన్నికల నియమ నిబంధనలపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మర్రి లక్ష్మి,ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఎన్నికల నియమ నిబంధనలపై పలు సూచనలు చేశారు. ఎన్నికలు మోడల్ కోడ్ అఫ్ కాండక్ట్‌పై సమగ్రమైన అవగాహన తెచ్చుకుని విధుల నిర్వ హణలో సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. 2024 అసెంబ్లీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికలలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై ఎంసిసి లీడర్ సత్యనారాయణ మాట్లాడుతూ శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఎన్నికల్లో మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ అమలులో ముఖ్యపాత్ర పోషించాల్సి వుంటుందన్నారు. ఎన్నికల కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను నిష్పక్షపాతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి శివాజీ పాణిగ్రహి, ఏపిఎం గోవిందు ఏపీఓ కె భాస్కరరావు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యం

- పలు అభివృద్ధి కార్యక్రమాలకు కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు శంకుస్థాపన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్రంలో సుపరిపాలన జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు అన్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాల మేరకు నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు శనివారం శంకుస్థాపన చేశారు. నగర పాలక సంస్థ పరిధిలోని రాధాకృష్ణ నగర్ కాలనీ, సాయిబులతోటలో రోడ్డు, గొంటివీధి సచివాలయ పరిధి, సోడావారి వీధిలలో డ్రైన్, కల్వర్ట్, నిర్మాణ పనులకు, శంకుస్థాపన చేసి, కాంపౌండ్ వాల్, ఎంట్రన్స్ గేట్లను ప్రారంభించి, ప్రకాష్ నగర్ కాలనీలో షాదీకాన ఉర్దూ ఘర్ ను పునర్నిర్మాణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల అండదండలు ఉన్నంతవరకూ జగనే ముఖ్యమంత్రని, ధర్మాన ప్రసాదరావే శ్రీకాకుళం ఎమ్మెల్యే అని కితాబిచ్చారు. పార్టీలకు అతీతంగా జగన్ పరిపాలన ఉందని, బిసిల పక్షపాతి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో జగన్ పరిపాలన మళ్లీ కొనసాగుతుందని, కార్పొరేషన్ చైర్మన్ పదవులన్నీ బీసీలకు అందించారని గుర్తు చేశారు. అభివద్ధి అంటే ధర్మాన అని ధర్మాన అంటే అభివద్ధి అని వివరించారు. ధర్మాన ప్రసాదరావు సారథ్యంలో శ్రీకాకుళం ఎంత అభివృద్ధి చెందిందో జిల్లా వాసులందరికీ తెలిసిన విషయమేనన్నారు. సీఎంగా జగన్‌మోహనరెడ్డిని, ధర్మాన ప్రసాదరావును శ్రీకాకుళం ఎమ్మెల్యేగా మనమంతా కలిసికట్టుగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన చేసిన అభివృద్ధి పనులకు, జిల్లా వాసులు మళ్ళీ ధర్మానకు పట్టం కడతారనటంలో సందేహం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలోని అభివద్ధి పనుల శంకుస్థాపనకు సూరిబాబు వెళ్లడంతో వార్డు ప్రజలు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు వేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్ పర్సన్ అలివేలు మంగమ్మ, వైసిపి యువనాయకులు చౌదరి సతీష్, మాజీ కౌన్సెలర్ మహమ్మద్ రఫీ, గుడ్ల దామోదరరావు, వైసీసీ జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకర్, డివిజన్ వైసీపీ ఇన్‌చార్జ్ బిర్లంగి రామ్మోహన్‌రావు, పండరీ, నాగవంశం కార్పొరేషన్ డైరక్టర్ నల్లి ఆశాదీపిక, వైసిపి నాయకులు పొలిశెట్టి మధుబాబు, సనపల రామారావు, కనపల తేజ, తదితర వైసిపి నాయకులతోపాటు, స్థానికులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం జగన్ మోహన్ రెడ్డి

- 26 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత
- మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి: బడుగు బలహీన వర్గ ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఓ వరమని ఇచ్ఛాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఇచ్ఛాపురం నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు పిరియా సాయిరాజ్ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న 26 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్దిదారులకు అందజేసారు. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యుడు పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న 26 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ 3,390,000 కోట్ల రూపాయల నగదు చెక్కులను మండల స్థాయి నాయకులతో కలసి పిరియా సాయిరాజ్ చెక్కులను పంపిణీ చేశారు. వైద్య రంగానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారన్నారు. వెయ్యి రూపాయలకు పైబడిన వైద్యాన్ని ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పోరేట్ ఆసుపత్రుల్లో వెసులుబాటు పేదలకు కల్పించారని అన్నారు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులోకి తెచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను త్వరితగతిన మంజూరు చేయించినందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, ఇచ్ఛాపురం నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు పిరియా సాయిరాజ్ కు, జడ్పీ చైర్పర్సన్ విజయమ్మకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ ప్రతినిది కడియాల ప్రకాష్, బోరివంక, బెజ్జిపుట్టుగ, జగతి గ్రామాల సర్పంచులు బెంధలం శ్రీరామ్ప్రసాద్, ఎస్ పి నారాయణ స్వామి, పూడి వర ప్రసాద్, జగతి వైస్ సర్పంచ్ బోసరాజు, వైయస్సార్సీపి యువ నాయకులు ఎస్పీ ప్రవీణ్, పూడి మౌర్య సారధి, బల్లెడ జయ ప్రకాష్, లబ్దిదారుల కుటుంబాలు తదితరులున్నారు.